సాక్షి అనంతపురం

శనివారం । 15 । ఫిబ్రవరి । 2025



చీనీ టన్ను రూ.22,780

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22,780 పలికాయి.



బాలోత్సవం.. భళా !

అనంతపురంలో శుక్రవారం పిల్లల పండుగ సందడి మొదలైంది. 'బాలోత్సవం'లో చిన్నారులు తమ అద్భుత ప్రదర్శనలతో ప్రశంసలు అందుకున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
37.9°/15.2°

జిల్లాలో శుక్రవారం చలి వాతావరణం నెలకొంది. పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి



విద్యార్థినికి అద్దాలు పంపిణీ చేస్తున్న మంత్రి సత్యకుమార్

గార్లదిన్నె: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించామని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం గార్లదిన్నె మోడల్ స్కూల్లో విద్యార్థులకు ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మంత్రితో పాటు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, కలెక్టర్ వినోద్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కంటి సమస్యలతో బాధపడుతున్న విద్యార్థుల కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక కార్యక్రమం తీసుకువచ్చారన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. అందులో భాగంగా ఒకే రోజు 90 వేల మంది విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటనారాయణ, వైస్ ఎంపీపీ కుంచం రామ్మోహన్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి, ఆర్డీఓ కేశవనాయుడు, డీఈఓ ప్రసాద్, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ, తహసీల్దార్ ఈరమ్మ పాల్గొన్నారు.

యూనిక్ ఐడీ తప్పనిసరి

బుక్కరాయసముద్రం: ప్రతి రైతూ యూనిక్ ఐడీ తప్పనిసరిగా కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ పేర్కొన్నారు. శుక్రవారం బి.కొత్తపల్లిలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి రైతూ యూనిక్ నంబర్ (విశిష్ట గుర్తింపు సంఖ్య) కలిగి ఉండాలన్నారు. యూనిక్ ఐడీతో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను సులభంగా పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ శ్యామ్ సుందర్‌రెడ్డి, పట్టు పరిశ్రమ సహాయకుడు రమాకాంత్, చౌడేశ్వరి రైతులు పాల్గొన్నారు.

మోదం.. ఖేదం

ఇటీవల విశాఖపట్నం కేంద్రంగా 'దక్షిణ కోస్తా రైల్వే' జోన్‌ను కేంద్రం ప్రకటించడం సంతోషం నింపినా.. కొత్త జోన్ కారణంగా గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధి భారీగా కుంచించుకుపోతుండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు నేపథ్యంలో గుంతకల్లు డివిజన్ పరిధిలోని రాయచూరు- నాల్వార్ సెక్షన్‌ను సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌లోకి కలుపుతున్నారు. దాదాపు 12 రైల్వేస్టేషన్లతో పాటు 108 కి.మీ రైల్వేలైన్‌ను కలిగి ఉన్న ఆ సెక్షన్‌ను కోల్పోవడం వల్ల గుంతకల్లు రైల్వే డివిజన్ పాత్ర నామమాత్రం కానుంది. కర్ణాటక పరిధిలోని ఈ మార్గాన్ని తెలంగాణ రాష్ట్రంలోని సికింద్రాబాద్ జోన్‌లో కలపడంలో హేతుబద్ధత ఎవరికీ అర్థం కావడం లేదు.



- తగ్గుతోన్న గుంతకల్లు రైల్వే డివిజన్ ప్రభ
- కొత్త జోన్లు, డివిజన్ల ఏర్పాటే శాపం
- ఆదాయం ఘనంగా ఉన్నా కానరాని ఆదరణ
- కేంద్ర ప్రభుత్వ శీతకన్నుపై సిబ్బంది ఆగ్రహం



గుంతకల్లు డీఆర్‌ఎం కార్యాలయం

గుంతకల్లు: గుంతకల్లు రైల్వే డివిజన్‌కు ఎంతో చరిత్ర ఉంది. 1927లో బ్రిటిష్ హయాంలో రైల్వేస్టేషన్‌ను ఏర్పాటు చేశారు. 1956లో డివిజన్‌గా మార్చారు. 1977లో దక్షిణ మధ్య రైల్వేలో భాగమైంది. అప్పటి నుంచి దక్షిణ మధ్య రైల్వేకు భారీగా ఆదాయం సమకూరుతోంది. ఏటా రూ.3,000 కోట్ల పైగానే ఆదాయాన్ని డివిజన్ ఆర్జిస్తోంది. ఇది రైల్వే డివిజన్ల సగటు ఆదాయంతో పోల్చినా ఎంతో ఎక్కువ కావడం గమనార్హం. మొత్తం 1,449 కి.మీ రైల్వేలైనుతో 157 రైల్వేస్టేషన్లను గుంతకల్లు డివిజన్ కలిగి ఉంది. డివిజన్ పరిధిలో రోజు 268 ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లతోపాటు 150కు పైగా గూడ్స్‌రైళ్లు వెళ్తున్నాయి. సరాసరి రోజూ రెండు లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఇంతటి ఘన చరిత ఉన్న గుంతకల్లు రైల్వే డివిజన్‌పై కేంద్ర ప్రభుత్వం శీతకన్ను వేస్తోంది. గత కొన్నేళ్లుగా బడ్జెట్‌లో మొండి చేయి చూపుతోంది. దశాబ్ద కాలంగా ఒక్క కొత్త రైలును కూడా డివిజన్‌కు కేటాయించలేదు. డివిజన్ కేంద్రం నుంచి ప్రారంభమయ్యే ఎక్స్‌ప్రెస్ రైలు ఒక్కటి కూడా లేదు. దీనిపై రైల్వే సిబ్బందే కాకుండా, రాయలసీమవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

395 కి.మీ రైలు మార్గం కుదింపు..

గుంతకల్లు రైల్వే డివిజన్ కుదింపు కార్యక్రమం చాలా ఏళ్లుగా జరుగుతోంది. గతంలో హుబ్లీ జోన్, గుంటూరు డివిజన్ ఏర్పడిన సందర్భంగా గుంతకల్లు రైల్వే డివిజన్ భారీగా రైలు మార్గాలను కోల్పోయింది. తాజాగా విశాఖపట్నం జోన్ కారణంగా గుంతకల్లు డివిజన్‌పై మరో పెద్ద దెబ్బ పడుతోంది. హుబ్లీ జోన్‌గా అప్‌గ్రేడ్ చేసే సమయంలో గుంతకల్లు డివిజన్‌లోని బళ్లారి-హొస్పేట్, తోర్నగల్-రంజిత్‌పూర సెక్షన్ మధ్య దాదాపు 136 కి.మీలతోపాటు 16 రైల్వేస్టేషన్లను కోల్పోయింది. గుంటూరు డివిజన్ ఏర్పాటు సమయంలో పాణ్యం-దొనకొండ మధ్య దాదాపు 151 కి.మీ రైలు మార్గంతో పాటు 14 రైల్వేస్టేషన్లను కోల్పోయింది. ప్రస్తుతం కొత్త రైల్వే జోన్‌తో 108 కి.మీతోపాటు మరో 12 రైల్వేస్టేషన్లు సికింద్రాబాద్ డివిజన్‌లోకి కలుపుతున్నారు. దీంతో గుంతకల్లు రైల్వే డివిజన్ దాదాపు 395 కి.మీ రైలు మార్గంతోపాటు 42 రైల్వేస్టేషన్లు కోల్పోయినట్లవుతోంది.

ప్రజాప్రతినిధులూ స్పందించరూ..

వాస్తవానికి గుంతకల్లు డివిజన్‌ను రైల్వే జోన్ చేయాలనే డిమాండ్ రాయలసీమవాసుల నుంచి ఎప్పటి నుంచో వినిపిస్తోంది. అయితే తగినంత రాజకీయ మద్దతు లేకపోవడంతో కల సాకారం కావడం లేదు. అయితే, ప్రస్తుత పరిస్థితులతో జోన్ సంగతి ఏమోగానీ, ఉన్న డివిజన్‌ను కాపాడుకోవడమే ఇప్పుడు ప్రధానాంశంగా మారింది. జిల్లా మీదుగా విశాఖకు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ తప్పితే మరో రైలు లేదు. విజయవాడకు కూడా రెండు, మూడు రైళ్లు మాత్రమే ఉన్నాయి. ఈ రూట్‌లో నడుస్తున్న అరకొర రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిసి ఉంటాయి. బెర్తులు దొరకక ప్రత్యక్ష నరకం కనిపిస్తుంటుంది. కనీసం కొత్త రైల్వేజోన్ ఏర్పాటు సందర్భంగా గుంతకల్లు మీదుగా విజయవాడ, విశాఖపట్నం మార్గంలో రైళ్లు పెంచాలని ఈ ప్రాంతా ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రతిసారీ దెబ్బ



జోన్, డివిజన్ ఏర్పడిన ప్రతిసారీ అది గుంతకల్లు డివిజన్‌పైనే దెబ్బ పడుతోంది. ఏదైనా మాట్లాడితే పరిపాలన సౌలభ్యం అని ఉన్నతాధికారులు అంటున్నారు. అయితే మన జిల్లాలో ఉన్న ధర్మవరం-హిందూపురం సెక్షన్‌ను (బెంగళూరు డివిజన్) మాత్రం గుంతకల్లు డివిజన్‌లోకి కలపడానికి ఎందుకు ప్రయత్నించరో అర్థం కావడం లేదు.

– ఎస్.విజయ్‌కుమార్, ఎస్‌సీఆర్‌ఎంయూ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి

చాలా బాధాకరం..



ఎక్కువ ఆదాయం సమకూరే మార్గాలను రీ ఆర్గనైజేషన్ పద్ధతి ద్వారా కలుపుతున్నారు. గతంలో గుంతకల్లు డివిజన్‌కు ఆదాయం తెచ్చిపెట్టిన 'బళ్లారి-హొస్పేట్'ను హుబ్లీలోకి విలీనం చేశారు. రాయచూర్ సెక్షన్‌ను డివిజన్ నుంచి విడదీయడం చాలా బాధాకరం. గుంతకల్లు డివిజన్‌కు అన్యాయం జరుగుతున్నా, అధికారులు వత్తాసు పలకడం పరిపాటిగా మారింది.

– కే.ప్రభాకర్, ఎస్‌సీఆర్‌ఈఎస్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి

రాయలసీమకు అన్యాయం



గుంతకల్లును రైల్వేజోన్‌గా చేయడానికి అన్ని విధాలా అవకాశం ఉన్నా పట్టించుకోవడం లేదు. పైగా డివిజన్‌ను కుదించడం అన్యాయం. రాయలసీమ ప్రాంత అభివృద్ధికి నిధులు కేటాయించకుండా అడుగడుగునా అన్యాయం చేస్తున్నారు.

– వై.రాజశేఖర్‌రెడ్డి, గుంతకల్లు రైల్వేజోన్ సాధన సమితి అధ్యక్షుడు

బంజారాల పుణ్యభూమి సేవాగఢ్



మాట్లాడుతున్న ట్రస్టు అధ్యక్షుడు జగన్నాథరావు, చిత్రంలో మంత్రి సత్యకుమార్ తదితరులు

గుత్తి రూరల్: దేశంలోనే బంజారాల పుణ్యక్షేత్రంగా సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జన్మించిన ప్రదేశం సేవాగఢ్ విరాజిల్లుతోందని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి సేవాగఢ్‌లో సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ 286వ జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ జయంతి ఉత్సవాలను మంత్రి సత్యకుమార్‌యాదవ్, ట్రస్టు అధ్యక్షుడు జగన్నాథరావు జ్యోతి ప్రజ్వలన చేసి, టెంకాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ప్రముఖ గాయకుడు గజల్‌శ్రీనివాస్, సేవాలాల్ ట్రస్టు అధ్యక్షుడు కొర్రా జగన్నాథరావు, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ దేశంలో ధర్మం, సమాజాభివృద్ధి, గో సంరక్షణకు పాటు పడ్డారన్నారు. బంజారాల హక్కుల కోసం జల్(నీరు), జమీన్(భూమి), జంగల్ (అడవి) అనే నినాదంతో పోరాడారన్నారు. అంతటి మహనీయుడైన సేవాలాల్ ఆలయం దిన దినాభివృద్ధి చెందుతోందన్నారు. ఈ సందర్భంగా బంజారా భాషలో గజల్ శ్రీనివాస్ సంగీతం అందించి పాడిన బంజారా శ్రీమద్ భగవద్గీతను మంత్రి ఆవిష్కరించారు. హంపి పీఠాధిపతి విద్యారణ్యస్వామి మాట్లాడుతూ బంజారాలు చెడు వ్యసనాలను వీడి దైవారాధన, సేవా కార్యక్రమాలు చేస్తూ సన్మార్గం వైపు పయనించాలని సూచించారు. ఉత్సవాలకు రాష్ట్రం నుంచే కాక తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. మహారాష్ట్ర మంత్రి సంజయ్ రాథోడ్ దంపతులు ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఇంకా వర్కింగ్ ప్రెసిడెంట్ రవీంద్ర నాయక్, ప్రధాన కార్యదర్శి అశ్వత్థనాయక్, సభ్యులు శేఖర్‌నాయక్, హరిలాల్ నాయక్, ఠాగూర్ నాయక్, డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు, ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, తహసీల్దార్ ఓబిలేసు, డీఎస్పీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైవీఆర్‌కు ఘన స్వాగతం



బాటసుంకలమ్మ ఆలయం వద్ద పార్టీ శ్రేణులనుద్దేశించి ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

వైఎస్సార్‌సీపీ గుంతకల్లు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డికి ఘన స్వాగతం లభించింది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లో చికిత్స పొంది కోలుకున్న తర్వాత శుక్రవారం గుత్తి మీదుగా గుంతకల్లులోని ఇంటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా తమ అభిమాన నేత వస్తున్న విషయం తెలుసుకున్న పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. బాణసంచా పేలుస్తూ.. డప్పులు వాయిద్యాల నడుమ డ్యాన్సులు చేస్తూ పూల వర్షంతో స్వాగతించారు. తనను చూసేందుకు తరలివచ్చిన గుంతకల్లు, గుత్తి, పామిడి ప్రాంత కార్యకర్తలు, నాయకులకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

– గుంతకల్లు:

ఏపీఈసెట్ నిర్వహణ బాధ్యత జేఎన్‌టీయూ(ఏ)కే

అనంతపురం: ఏపీ ఈసెట్ (ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్)-2025 నిర్వహించడానికి జేఎన్‌టీయూ అనంతపురానికి అవకాశం దక్కింది. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ అనంతరం తొలిసారి జేఎన్‌టీయూ(ఏ)కు ఏపీ ఈసెట్ అప్పగించారు. ఇప్పటి వరకు రెండు దఫాలు (జేఎన్‌టీయూ కాకినాడ) మినహా ఏపీ ఈసెట్ బాధ్యతలు జేఎన్‌టీయూకే దక్కింది. దీంతో 8వ దఫా జేఎన్‌టీయూఏ ఈసెట్ నిర్వహించనుంది. ఏపీ ఈసెట్ రాష్ట్ర కన్వీనర్‌గా మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్‌ను నియమించారు. ఇప్పటికే ఐదు దఫాలు ఏపీ ఈసెట్ కోకన్వీనర్‌గా పనిచేసిన అనుభవం ఉండడంతో ఏపీ ఈసెట్ రాష్ట్ర కన్వీనర్‌గా ఈయనకు అవకాశం కల్పించారు. ఏపీ ఈసెట్‌ను ఇప్పటిదాకా అత్యధిక సార్లు ఏపీ ఈసెట్ కన్వీనర్‌గా ప్రొఫెసర్ పీఆర్ భానుమూర్తి నిర్వర్తించారు. మే 6న ఏపీ ఈసెట్‌ను నిర్వహిస్తారు. డిప్లొమా పూర్తి చేసిన వారికి లేటరల్ ఎంట్రీ కింద నేరుగా బీటెక్ రెండో సంవత్సరంలో అడ్మిషన్లు కల్పిస్తారు. ఇదిలా ఉండగా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి ఒక్క సెట్ కూడా నిర్వహించే అవకాశం రాలేదు. గతేడాది ఏపీఐసెట్ నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. తాజాగా ఏ ఒక్క సెట్టూ కేటాయించలేదు.

నిర్వహణ లోపాలు.. ప్రజలకు కన్నీళ్లు

- 'శ్రీరామిరెడ్డి' పథకం పంప్‌హౌస్‌లో షార్ట్‌సర్క్యూట్
- 645 గ్రామాలకు ఆగిన తాగునీటి సరఫరా



బ్రహ్మసముద్రం మండలం సూగేపల్లిలో నీరు రాని 'శ్రీరామిరెడ్డి' తాగునీటి కొళాయిలు

కళ్యాణదుర్గం: శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు కష్టాలు తెచ్చిపెట్టింది. వేసవికి ముందే దాహం కేకలు మొదలయ్యాయి. బెళుగుప్ప మండలం గంగవరం వద్ద ఏర్పాటు చేసిన శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం పంప్ హౌస్‌లో మూడు రోజుల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఇండోర్ బ్రేకర్, విద్యుత్ పరికరాలు పూర్తిగా కాలిపోయాయి. పీఏబీఆర్ నుంచి ఫేజ్-1 కింద ఉన్న శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ప్రధాన పైపులైన్ ద్వారా కళ్యాణదుర్గం రూరల్, కళ్యాణదుర్గం మున్సిపాలిటీ, హిందూపురం రూరల్, హిందూపురం మున్సిపాలిటీ, మడకశిర నియోజకవర్గాల పరిధిలో 645 గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఆయా నియోజకవర్గాల్లో రోజుకు 28 ఎంఎల్‌డీ నీరు సరఫరా జరగాల్సి ఉంది. ఒక్కసారిగా నీటి సరఫరా ఆగిపోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు.

రిపేరీ ఎప్పుడో మరి?

పంపు హౌస్‌లో కాలిపోయిన మోటర్లు తదితర విద్యుత్ పరికరాలను ఎప్పుడు రిపేరీ చేస్తారో తెలియడం లేదు. వాస్తవానికి పంప్ హౌస్‌లో విద్యుత్ మరమ్మతులు చేయాలంటే పూణే, బెంగళూరు వంటి నగరాల నుంచి ఇంజినీర్లు రావాలి. అయితే ఇప్పటివరకు సదరు ఇంజినీర్లను పిలిపించేందుకు అధికారులు ఎలాంటి ప్రయత్నాలూ చేయలేదని తెలుస్తోంది. స్థానికంగా ఉన్న మెకానిక్‌లతో రిపేరీకి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఒక వేళ వారితో రిపేరీ చేయించినా మళ్లీ కొద్ది రోజులకే పంపులు పాడవడం తథ్యమని, సమస్య మళ్లీ మొదటికొస్తుందని పలువురు పేర్కొంటున్నారు.

18 నుంచి కార్మికుల సమ్మెబాట

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల18 నుంచి సమ్మె బాట పట్టనున్నారు. దీంతో తాగునీటి సమస్య మరింత జటిలం కానుంది. ఫేజ్-1 కార్మికులకు ఐదు నెలల వేతనాలు, 30 నెలల పీఎఫ్ బకాయిలు చెలించాల్సి ఉంది. హిందూపురం, మడకశిర, పరిగి కార్మికులకు 10 నెలల వేతనాలు, 30 నెలల పీఎఫ్ బకాయిలు చెల్లించాల్సి ఉంది. గత 14 ఏళ్లుగా పీఏబీఆర్‌లో ఫిల్టర్ బెడ్లు మార్చలేదని తెలుస్తోంది. వీటిని వెంటనే మార్చాల్సి ఉంది. కళ్యాణదుర్గం పంపుహౌస్ వద్ద కరెంటు సరఫరా ఆగినప్పుడు రిటర్న్ వాల్వు లేకపోవడం వల్ల పైపులు పగిలి పోతున్నాయి. దీనికి కార్మికులను బాధ్యులు చేస్తున్నారు. తరచూ లీకేజీలకు గురవుతున్న నాసిరకం పైపులను మార్చాల్సి ఉంది. అయితే అధికారులు, సదరు కాంట్రాక్టర్లు వీటి వైపు కన్నెత్తి చూడటం లేదు.

వేతనాలు విడుదల చేయాలి



కార్మికులకు చెల్లించాల్సిన బకాయి వేతనాలను వెంటనే విడుదల చేయాలి. దీనికి తోడు 30 నెలల పీఎఫ్ చెల్లించాలి. కనీస వేతనం అమలు చేయాలి. నీటి మీటర్లు బిగించరాదు. వేతనాలు అడిగితే కాంట్రాక్టర్లు, అధికారులు ఒకరి మీద ఒకరు చెప్పుకుంటున్నారు. ప్రజలకు తాగునీరు ఉచితంగా అందించాలి. లేని పక్షంలో నిరంతర ఉద్యమం చేస్తాం.

– వన్నూరుస్వామి, జిల్లా కోశాధికారి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్

సమస్య తీవ్రం కాకనే పరిష్కరించండి



వేసవి రాకముందే తాగునీటి సమస్య వచ్చింది. ఏ ఊర్లో చూసినా నీటి కోసం ప్రజలు పడిగాపులు కాస్తున్నారు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు వేతనాల కోసం సమ్మెలోకి వెళ్తున్నారు. ఈ సమయంలోనే గంగవరం పంప్ హౌస్ వద్ద విద్యుత్ మోటర్లు కాలిపోయాయి. మరమ్మతులు చేసేందుకు ఎవరో పూణే నుంచి రావాలంటున్నారు. అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం విడ్డూరం. వెంటనే అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– గోళ్ల సూర్య నారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, కళ్యాణదుర్గం

క్లుప్తంగా

200 చీనీచెట్లు దగ్ధం


కాలిన చెట్లను చూపుతున్న రైతు రఘునాథ్‌రెడ్డి

ఆత్మకూరు: మండల కేంద్రమైన ఆత్మకూరుకు చెందిన రైతు రఘునాథరెడ్డికి చెందిన 200 చీనీ చెట్లు శుక్రవారం దగ్ధమయ్యాయి. బాధితుడి వివరాలమేరకు.. ఉదయం పది గంటల సమయంలో తోట దగ్గరకు వెళ్లి వచ్చానని, ఆ తర్వాత తోటకు మంటలు వ్యాపించాయని స్థానికులు ఫోన్ చేయడంతో పరుగున వెళ్లినట్లు చెప్పారు. స్థానికుల సహాయంతో మంటలు అదుపు చేశామని, దాదాపు 200 చెట్లు మంటల్లో కాలిపోయినట్లు వాపోయారు. చీనీచెట్లను నాలుగు సంవత్సరాల నుంచి కంటి రెప్పలా చెట్లు చూసుకుంటున్నానని, గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ తాగి పడేయడం వల్లనో, మరేవిధంగా జరిగిందో అర్థం కావడం లేదన్నారు.

విద్యార్థినితో అసభ్య ప్రవర్తన

- రెండు నెలల పాటు ఎంఎన్‌ఓ సస్పెన్షన్

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో అనస్తీషియా టెక్నీషియన్ కోర్సు చేస్తున్న ఓ విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించాడన్న ఆరోపణలపై మేల్ నర్సింగ్ ఆర్డర్లీ (ఎంఎన్‌ఓ) చిన్నప్పయ్యను రెండు నెలల పాటు సస్పెండ్ చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే... గత నెలలో ఆపరేషన్ థియేటర్‌లో ఎంఎన్‌ఓ చిన్నప్పయ్య అసభ్యంగా ప్రవర్తించాడని సదరు విద్యార్థిని సర్వజనాస్పత్రి అధికారులకు ఫిర్యాదు చేసింది. నెల రోజుల తర్వాత ఆర్ఎంఓ ఆధ్వర్యంలో విచారణకు ఆదేశించారు. విచారణలో భాగంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంఎన్‌ఓ చిన్నపయ్యను రెండు నెలల పాటు సస్పెండ్ చేశారు.

కులగణన చేపట్టాలి



మాట్లాడుతున్న కె.రామకృష్ణ

గుంతకల్లు: దేశ వ్యాప్తంగా జనగణన కాకుండా కులగణన సర్వే చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం సీపీఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులగణన చేపట్టే విషయంలో బీజేపీ ప్రభుత్వం ముందుకు రావడం లేదన్నారు. కేంద్ర ఫలాలు ప్రతి కులానికి అందేటట్లుగా చూడాలన్నారు. అగ్రిగోల్డ్ సమస్యను పరిష్కారించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. బాధితులకు న్యాయం చేయకపోతే నిరసన కార్యక్రమాలు ముమ్మరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గోవిందు, వీరభద్రస్వామి, ఎస్ఎండీ గౌస్, రాము రాయల్, కుళ్లాయప్ప, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.


చిన్నారుల నృత్య ప్రదర్శన



దేశభక్తిని చాటేలా..

బాలోత్సవం.. భళా !



- ఆటపాటలతో సందడిగా ప్రారంభమైన పిల్లల పండుగ
- చదువుతో పాటు కళల్లోనూ ప్రోత్సహించాలన్న వక్తలు

అనంతపురం కల్చరల్: చదువుల్లోనే కాదు తాము ఏ రంగంలోనైనా తీసిపోమని చిన్నారులు చాటి చెప్పారు. తాము వేదికెక్కితే కరతాళధ్వనులు ఎలా మారుమోగుతాయో నిరూపించారు. విద్యార్థుల్లోని ప్రతిభాపాటవాలు, నైపుణ్యాలను వెలికితీయడానికి దోహదపడుతున్న బాలోత్సవం శుక్రవారం అనంతపురం నగరంలోని లలితకళాపరిషత్తు, గిల్డ్ ఆఫ్ సర్వీసు ప్రాంగణాల్లో ప్రారంభమైంది. ఆటపాటలు, వివిధ రకాల పోటీలలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారి ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

జాలువారిన సృజన

లలితకళాపరిషత్తులో శాస్త్రీయ, జానపద నృత్యాలు, ఫోక్, లలిత సంగీతం, వివిధ రకాల వేషధారణలు, సందేశాత్మక నాటికలు వంటి కళాత్మక అంశాల్లో చిన్నారులు పాలుపంచుకున్నారు. అలాగే గిల్డ్ ఆఫ్ సర్వీసు ప్రాంగణంలో వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, బొమ్మలు చేయడం, పత్రికా పఠనంతో పాటూ సైన్సు ప్రయోగాలతో చిన్నారులు అబ్బురపరిచారు. నాట్యాచార్యులు సంధ్యామూర్తి, పట్నం శివప్రసాద్ శిష్యబృందాల స్వాగత శాస్త్రీయ నృత్యాలు, గణేషస్తుతితో కార్యక్రమాలను ప్రారంభించారు.

బాల్యాన్ని కాపాడుకుందాం

ఎంతో అందమైన బాల్యాన్ని ఒత్తిడి నింపే చదువుతోనూ, హాని కల్గించే సాంకేతిక పరిజ్ఞానంతో కాకుండా మనో విజ్ఞానాన్ని కల్గించే కళలు, ఆటపాటలతో కాపాడుకుందామని బాలోత్సవ కమిటీ చైర్‌పర్సన్ షమీమ్ షఫీవుల్లా, జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు పిలుపునిచ్చారు. మూడు రోజుల పాటూ సాగే బాలోత్సవాన్ని వీసీతో పాటు లలితకళాపరిషత్తు కార్యదర్శి పద్మజ, ఐద్వా నాయకురాలు సావిత్రి, పలువురు కళాకారులు, విద్యావేత్తలు, మాజీ సైనికులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యాన్ని చిదిమేసే అనేక సంఘటనలు విద్యా సంస్థల ద్వారానే సాగుతుండటం బాధాకరమన్నారు. చిన్నారుల్లోని సృజనను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ముఖ్యంగా సోషల్ మీడియా తెస్తున్న విప్లవంతో మొదట పాడవుతున్నది విద్యార్థులేనని ఆందోళన వ్యక్తం చేశారు. వారిని కాపాడుకోవడం అందరి బాధ్యత అన్నారు. తొలిరోజు విజేతలుగా నిలిచిన చిన్నారులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందజేశారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్, సీపీఎం నేత రాంభూపాల్, సామాజిక సేవా కార్యకర్త రవికాంత్ రమణ, బాలోత్సవ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, రామాంజనమ్మ, నాగేంద్ర పాల్గొన్నారు.





జెండా ఆవిష్కరిస్తున్న జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ సుదర్శనరావు, నాటకంలో భాగంగా చిన్నారుల ప్రదర్శన, జంక్ ఫుడ్ తినొద్దంటూ ప్యాకెట్లను ప్రదర్శిస్తున్న బాలుడు, తిలకిస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ఆవును తప్పించబోయి బావిలో పడిన కారు

- ఒకరి మృతి, మరొకరు ప్రాణాలతో బయటపడిన వైనం



బావిలో పడిన కారును తీస్తున్న దృశ్యం (ఇన్‌సెట్‌లో) మృతుడు షాబుద్దీన్

శింగనమల: కారు బావిలోకి దూసుకెళ్లడంతో ఒకరు మృతి చెందగా.. మరొకరు ప్రాణాలతో బయటపడిన సంఘటన నాయనపల్లి క్రాస్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ వివరాల మేరకు....అనంతపురానికి చెందిన షాబుద్దీన్ (40), ఇర్ఫాన్ జియో కంపెనీలో పని చేస్తున్నారు. అనంతపురం–తాడిపత్రి రహదారి నిర్మాణంలో ఉండటంతో అనంతపురం నుంచి నార్పల, నాయనపల్లి క్రాస్ మీదుగా తాడిపత్రి, అక్కడి నుంచి యాడికి వెళ్లేందుకు కారులో బయలుదేరారు. షాబుద్దీన్ సీట్‌బెల్ట్ పెట్టుకొని కారు నడుపుతుండగా.. ఇర్ఫాన్ ల్యాప్‌టాప్‌లో పని చేసుకుంటూ ఉన్నారు. నడిమిదొడ్డిదాటిన తరువాత నాయనపల్లి క్రాస్ సమీపంలో ఆవు రోడ్డుకు అడ్డంగా రావడంతో తప్పించబోయి రోడ్డు పక్కలో పున్న 40 అడుగుల లోతులో ఉన్న బావిలోకి కారు దూసుకెళ్లింది. కారు డోరు ఓపెన్ కావడంతో ఇర్ఫాన్ బయటపడ్డారు. షాబుద్దీన్ సీట్‌బెల్ట్ పెట్టుకోవడంతో కారులోనే ఉండిపోయారు. గమనించిన గొర్రెల కాపర్లు పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే నార్పల ఎస్ఐ సాగర్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని షాబుద్దీన్ మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సంఘటనా స్థలాన్ని సీఐ కౌలుట్లయ్య పరిశీలించారు.

నేడు టీచర్లకు మూడుసార్లు అటెండెన్స్

అనంతపురం ఎడ్యుకేషన్: క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల నేపథ్యంలో శనివారం ఉపాధ్యాయులు మూడుసార్లు యాప్‌లో అటెండెన్స్ వేయాల్సి ఉంటుంది. ఉదయం 9 గంటలకు పని చేస్తున్న పాఠశాలలో (ఇన్‌టైమ్) అటెండెన్స్ వేయాలి. మధ్యాహ్నం 12.45 గంటల నుంచి 1.30 గంటల లోపు క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్‌లో (ఇన్‌టైమ్), సాయంత్రం 5 నుంచి 6 గంటలలోపు అక్కడే (అవుట్ టైమ్) అటెండెన్స్ వేయాల్సి ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు తెలిపారు.

11.45 గంటలకు మధ్యాహ్న భోజనం

అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ విద్యార్థులకు ఉదయం 11.45 గంటలకు మధ్యాహ్న భోజనం పెట్టాలని డీఈఓ ప్రసాద్‌బాబు, సమగ్రశిక్ష ఏపీసీ శైలజ సూచించారు. తర్వాత పిల్లలను ఇళ్లకు పంపించి 12 నుంచి 1 గంటలోపు క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్‌కు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. ఏ ఒక్కరికీ మినహాయింపు ఉండదని, విధిగా కాంప్లెక్స్ సమావేశాలకు హాజరుకావాల్సి ఉంటుదని స్పష్టం చేశారు. జిల్లాలో 135 క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్‌ల్లో సమావేశాలు జరుగుతాయన్నారు.

జాతీయ సమైక్యత శిబిరానికి కావ్య


కావ్యను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సత్యలత

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన బీఎస్సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని బి. కావ్య జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికైంది. ఈ మేరకు ఎస్కేయూ ఎన్ఎస్ఎస్ సమన్వయ అధికారి ఆచార్య మురళీధర్‌రామ్ నుంచి సమాచారం అందినట్లు కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బి.రమణానాయుడు తెలిపారు. విద్యార్థిని కావ్య మహారాష్ట్రలోని కొల్హాపూర్ శివాజీ విశ్వ విద్యాలయంలో ఈ నెల 16 నుంచి 22 వరకూ జరిగే జాతీయ సమైక్యత శిబిరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ప్రాతినిథ్యం వహిస్తారని పేర్కొన్నారు. కళాశాల విద్యార్థినిని జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపిక కావడంపై ప్రిన్సిపాల్ డాక్టర్ కేసీ సత్యలత, వైస్ ప్రిన్సిపల్ లక్ష్మీరంగయ్య అభినందించారు. జాతీయ శిబిరంలో ఉత్తమ ప్రతిభ కనపరిచి కళాశాల కీర్తి ప్రతిష్టలు ఇనుమడింపజేయాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు.

20 నుంచి బుగ్గ రామలింగేశ్వర బ్రహ్మోత్సవాలు

తాడిపత్రి రూరల్ : పట్టణంలోని ప్రసిద్ధ పార్వతీ సమేత బుగ్గరామలింగేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 20 నుంచి బ్రహోత్సవాలు నిర్వహించనున్నారు. 20న అంకురార్పణ, 21న ధ్వజారోహణ, 22న వాసుకీ వాహనం, 23న సింహ వాహనం, 24న నరమృగ వాహనం, 25న గజ వాహనం, 26న మహా శివరాత్రి పండుగను పరస్కరించుకొని ఉదయం నంది వాహనం, రాత్రి అధికార నంది వాహనోత్సవం ఉంటుంది. 27న అమావాస్యను పురస్కరించుకొని శివ పార్వతుల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. 29న అశ్వవాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ఆదర్శప్రాయుడు దామోదరం సంజీవయ్య


సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం అర్బన్: అత్యున్నత వ్యక్తిత్వం, ఉన్నత విలువలకు మారుపేరైన దామోదరం సంజీవయ్య ఆదర్శప్రాయుడని అని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య ఎనలేని సేవలందించారన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో దామోదరం సంజీవయ్య 104వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జెడ్పీ చైర్‌పర్సన్, జేసీతో పాటు డీఆర్‌ఓ మలోల, అధికారులు, ఎస్సీ ప్రజాసంఘాల నాయకులు, ప్రతినిధులు పుష్పాంజలి ఘటించి, నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడారు. కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు దేశంలో కార్మిక, విద్యా శాఖల్లో పలు సంస్కరణలు చేసి, రూపొందించిన చట్టాలు వివిధ వర్గాలకు ఎనలేని మేలు చేశాయన్నారు.

అపార్ట్‌మెంట్ పై నుంచి పడి వృద్ధుడి మృతి

అనంతపురం: నగరంలోని మంగళవారి కాలనీలో రాములప్ప (75) అపార్ట్‌మెంట్‌పై నుంచి కిందకు పడి మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రామ్‌ప్రసాద్ వివరాలమేరకు... కదిరి రూరల్ మండలం కుటాగుళ్ల పంచాయతీ కొత్తపల్లికి చెందిన మచ్చ రాములప్పకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. అనంతపురం నగరంలోని మంగళవారి కాలనీలో ఉంటున్న కుమారుడి వద్దనే రాములప్ప ఉంటున్నాడు. అయితే శుక్రవారం అపార్ట్‌మెంట్ పై ఫ్లోర్ నుంచి ప్రమాదవశాత్తూ కాలు జారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన రాములప్పను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ అక్కడ మృతి చెందాడు. రోజూ మనవరాలితో కలిసి అపార్ట్‌మెంట్‌పైకి వెళ్లి వాకింగ్ చేసేవారని స్థానికులు తెలిపారు. అతని కుమారుడు మచ్చ నాగమునెప్ప నంద్యాలి జిల్లా ప్యాపిలి వద్ద గాలిమరల ఆఫీస్‌లో ఆఫీస్ బాయ్‌గా పనిచేస్తున్నట్లు చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మాతాశిశు మరణాల నివారణకు చర్యలు


సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ వీరపాండియన్

కూడేరు: ఏఐ టెక్నాలజీతో రూపొందించిన జననీ మిత్ర యాప్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా గర్భిణుల్లో రక్తహీనత లేకుండా చేసి మాతాశిశు మరణాలు జరగకుండా అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ తెలిపారు. కూడేరు పీహెచ్‌సీని పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేశారు. శుక్రవారం కలెక్టర్ వినోద్ కుమార్, డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవితో కలిసి ఆయన కూడేరు పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ల్యాబ్‌ను పరిశీలించి అక్కడ చేపడుతున్న పరీక్షలపై ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్‌తో ఆరా తీశారు. గర్భిణులు ఎంతమంది ఉన్నారు.. హైరిస్క్ వారు ఎంతమంది.. వారి ఆరోగ్యం పట్ల తీసుకుంటున్న శ్రద్ధ గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తర్వాత ఎన్‌సీడి-సీడీ 3.0, రాష్ట్రీయ బాల ఆరోగ్య స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) సర్వే పురోగతిపై అధికారులతో సమీక్షించారు. అనంతరం కూడేరులో జరుగుతున్న ఎన్‌సీడీ–సీడీ3.0 క్యాన్సర్ సర్వేని పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోనే పామిడి, కూడేరు మండలాల్లోనే గర్భిణుల్లో రక్త హీనత ఎక్కువగా ఉన్నట్లు తేలిందన్నారు. రక్తహీనత అరికట్టేందుకు కూడేరు పీహెచ్‌సీని పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకుని జననీ మిత్ర యాప్‌తో స్వస్తి స్వచ్ఛంద సంస్థ ద్వారా గర్భిణి ఎంత ఆహారం తీసుకుంటోంది. అందులో పోషకాలు ఎంత ఉన్నాయి.. ఆమె ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది తెలుసుకుంటారన్నారు. ఆరు నెలల్లో పురోగతి సాధించేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, ప్రోగ్రాం జిల్లా అధికారులు యుగంధర్, అనుపమ జేమ్స్, నారాయణస్వామి, రవి శంకర్, ఓబులు, తహసీల్దార్ మహబూబ్ బాషా, మండల వైద్యాధికారులు లక్ష్మీనారాయణ, సౌమ్యారెడ్డి, సూపర్‌వైజర్లు రవీంద్ర, యశోద, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో పునర్జన్మ

- ఎస్పీ పి. జగదీష్


హెల్మెట్ ధరించి బైక్‌పై ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ జగదీష్

అనంతపురం: తల్లి జన్మనిస్తే.. హెల్మెట్ పునర్జన్మనిస్తుంది.. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యం చేరాలని ఎస్పీ పి. జగదీష్ పిలుపునిచ్చారు. హెల్మెట్ ధరింపుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆధ్వర్యంలో అనంతపురంలో శుక్రవారం బైక్ ర్యాలీ చేపట్టారు. ఎస్పీ మాట్లాడుతూ గతేడాది జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 300 మంది దాకా చనిపోగా, 280 మంది గాయాలపాలైనట్లు పేర్కొన్నారు. ఇందులో 50 శాతం టూవీలర్ రోడ్డు ప్రమాదాలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ఉపయోగాల గురించి వివరించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్, సప్తగిరి సర్కిల్, సుభాష్ రోడ్డు, క్లాక్‌టవర్ మీదుగా ర్యాలీ నిర్వహించారు.

18 నుంచి కార్మికుల నిరవధిక సమ్మె


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్: నీలకంఠాపురం శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుళు మండిపడ్డారు. బకాయి వేతనాలు చెల్లించాలనే డిమాండ్‌తో ఈనెల 18 నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు వెల్లడించారు. శుక్రవారం స్థానిక జేవీవీ కార్యాలయంలో ఏర్పాటు చేసి కార్యక్రమంలో సమ్మె కార్యక్రమాల ప్రణాళిక కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్, నాయకులు రాము, నాగరాజు, వన్నూరుస్వామి, సోము, లోకేష్, మురళీ పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం రూరల్: రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం డ్వామా సమావేశ మందిరంలో అనంతపురం రెవెన్యూ డివిజన్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఏ స్థాయిలోనూ పెండింగ్‌లో ఉంచకూడదన్నారు. కోర్టు కేసులకు సంబంధించి విధిగా కౌంటర్లు అప్‌లోడ్ చేయాలన్నారు. అధికారులు అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జేసీ శివనారాయణ శర్మ, డీఆర్‌ఓ మలోల, ఆర్డీఓ కేశవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

లారీపై నుంచి కింద పడి డ్రైవర్ మృతి


మృతుడు రాజు

యాడికి: ప్రమాదవశాత్తూ లారీపై నుంచి కింద పడి లారీడ్రైవర్ రాజు (45) చనిపోయాడు. కుటుంబ సభ్యుల వివరాలమేరకు.. యాడికి మండలం కూర్మాజీపేటకు చెందిన రాజు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య చిన్నక్క, ఇద్దరు కుమారులున్నారు. రాజు గత బుధవారం గుంటూరు జిల్లా పిడుగురాళ్ల సమీపంలోని చెట్టినాడు సిమెంట్ కర్మాగారానికి వెళ్లి మట్టిని అన్‌లోడ్ చేయించారు. అయితే లారీపైన ఉన్న రాజు ప్రమాదవశాత్తూ ఒక్కసారిగా కింద పడ్డాడు. సహచర లారీ డ్రైవర్లు అతన్ని ఆస్పత్రికి తరలించగా అప్పటికే రాజు చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. రాజు మృతదేహాన్ని శుక్రవారం రాత్రి స్వగ్రామానికి తీసుకొచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంజీవరాయుడు, రాయలచెరువు ఉప సర్పంచు ప్రవీణ్‌కుమార్‌యాదవ్.. రాజు మృతదేహం వద్ద నివాళులర్పించారు.

నేడు రేడియో రైతు దినోత్సవం

అనంతపురం సిటీ: అనంతపురంలోని జిల్లా పరిషత్ క్యాంపస్‌లోని డీపీఆర్‌సీ భవన్‌లో రేడియో రైతు దినోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు ఆకాశవాణి స్టేషన్ డైరెక్టర్ జి.నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, మేయర్ మహమ్మద్ వసీం గౌరవ అతిథులుగా రానున్నట్లు పేర్కొన్నారు. జెడ్పీ సీఈఓ రాజోలి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, రైతులు హాజరవుతారని తెలిపారు. ముందుగా 10.45 గంటలకు తెలుగుతల్లి విగ్రహం నుంచి జెడ్పీ వరకు ఎడ్లబండిలో చేరుకుంటారన్నారు. ఉమ్మడి జిల్లా రైతులు పెద్ద ఎత్తున తరలిరానున్నట్లు వివరించారు.

ద్విచక్ర వాహనంపై కుంభమేళాకు..



ప్రయాగ్‌రాజ్‌కు చేరుకున్న రాయదుర్గం యువకులు భాస్కర్, గణి

రాయదుర్గంటౌన్: పట్టణానికి చెందిన ఇద్దరు స్నేహితులు ద్విచక్ర వాహనంపై మహా కుంభమేళాకు వెళ్లారు. పట్టణంలోని కొలిమివీధికి చెందిన భాస్కర్, గణి మూడురోజుల క్రితం బైక్‌పై బయలు దేరారు. వారు శుక్రవారం ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమంలో నదీస్నానం ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ మేరకు అక్కడికి క్షేమంగా చేరుకున్న ఫోటోలను బంధువులు, స్నేహితులు, సోషల్ మీడియాలో షేర్ చేశారు.

క్లుప్తంగా

జాబ్‌మేళాలో 19 మందికి ఉద్యోగాలు

అనంతపురం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఎంప్లాయిమెంట్, సిడాప్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. 19 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ మేనేజర్ పీవీ ప్రతాప్ రెడ్డి, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

అనంతపురం: నగరంలోని మున్నానగర్‌లో ఇంటి నిర్మాణానికి పక్కింటి వారు అడ్డుపతున్నారనే కారణంతో మనస్థాపానికి గురై షాషావలి అనే వ్యక్తి గురువారం రాత్రి పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు షాషావలిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఇంటి నిర్మాణ సమయంలో గొడవ జరగడంతో పురుగుల మందు సేవించినట్లు షాషావలి పోలీసులకు తెలిపాడు.

మార్చి 24, 25 తేదీల్లో బ్యాంక్ ఉద్యోగుల సమ్మె



సాయినగర్ స్టేట్ బ్యాంక్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

అనంతపురం సెంట్రల్: సమస్యల పరిష్కారం కోసం మార్చి 24, 25 తేదీల్లో దేశ వ్యాప్తంగా బ్యాంక్ ఉద్యోగులు సమ్మె చేపడుతున్నట్లు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ నాయకుడు ఖాదర్ బాషా తెలిపారు. శుక్రవారం సాయినగర్ స్టేట్ బ్యాంక్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకుల్లో అన్ని విభాగాల్లో పర్మినెంట్ ఉద్యోగాలు చేపట్టాలన్నారు. ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకుల ప్రైవేటీకరణ ఆపాలని కోరారు. వారానికి ఐదు రోజుల పని దినాలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చంద్రమోహన్, చంద్రశేఖర్, నరేంద్రరెడ్డి, రఘురామ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



భోజనం వడ్డిస్తున్న శ్రీనివాసులు నాయక్

రాప్తాడు: శింగనమల మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి భర్త, ఏపీ మాజీ ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి పుట్టిన రోజు వేడుకలు కుటుంబ సభ్యులు, అభిమానులు పండుగలా జరుపుకున్నారు. శుక్రవారం మండలంలోని సెయింట్ విన్సెంట్ డీపాల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలోని వృద్ధాశ్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు నాయక్ (బాబు) ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రవికుమార్ నాయక్, బీకేఎస్ మండల ఎస్సీ సెల్ నాయకులు వరికుటి కాటమయ్య, నార్పల మండల ఎస్సీ సెల్ నాయకులు నాగేంద్ర, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం



మాట్లాడుతున్న సీఐ శేఖర్

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలి. చదువుతో పాటు మన కట్టుబాట్లు, సంప్రదాయాలకు గౌరవం ఇవ్వాలని రూరల్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శేఖర్ సూచించారు. పాములాయి సమీపంలోని శ్రీచైతన్య రెసిడెన్షియల్ పాఠశాలలో శుక్రవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో చదువుకున్న ప్రాధాన్యతను తెలియజేశారు. ప్రణాళిక ప్రకారం చదువుకుంటే అనుకున్న లక్ష్యం నెరవేరుతుందన్నారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం సుబ్బారెడ్డి, రూరల్ పోలీస్ స్టేషన్ రైటర్ జయకర్, పాఠశాల ప్రిన్సిపాల్స్ సమీనా ఖాన్, విశ్వనాథ్, వైస్ ప్రిన్సిపల్ కరీముల్లా, డీన్లు చిన బాబు, గంగాధర్, ఈశ్వర్ రెడ్డి, ఏఓలు గోపాల్, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

ఎల్లమ్మ దేవతకు పూజలు

రామగిరి: మండలంలోని పోలేపల్లిలో శుక్రవారం ఎల్లమ్మ దేవతకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. మహిళలు బోనాలతో ఊరేగింపు చేపట్టి, అమ్మవారికి సమర్పించారు. అంతకుముందు అమ్మ వారిని పూలతో అలంకరించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు ఎల్లమ్మకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఎల్లమ్మ దేవతను పురవీధుల్లో ఊరేగించారు.

అన్నదాతకు విశిష్ట గుర్తింపు

- ఆధార్ తరహాలో ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయింపు
- వ్యవసాయ సంబంధిత పథకాలు, రాయితీలు, ప్రోత్సాహకాలు పొందేందుకు ఈ కార్డులు తప్పనిసరి
- రైతు సేవా కేంద్రాల్లో నమోదు ప్రారంభం



రాప్తాడులోని రైతు సేవా కేంద్రంలో వివరాలు నమోదు చేస్తున్న ఏఈఈ శ్రీనివాసులు

రాప్తాడు: ఆధార్ కార్డు తరహాలోనే దేశంలో రైతులకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యతో కార్డులు జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే వ్యవసాయ సంబంధిత పథకాలు, రాయితీలు, ప్రోత్సాహకాలు పొందేందుకు ఈ కార్డులు తప్పనిసరి అని అధికారులు చెబుతున్నారు. ఈ కార్డుల కోసం ఫార్మర్ రిజిస్ట్రీలో రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాప్తాడు నియోజకవర్గంలో రైతు సేవా కేంద్రాల్లో (రైతు భరోసా కేంద్రాలు) ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వ్యవసాయ అధికారులు ప్రారంభించారు. పట్టాదారు పాసుపుస్తకం, వన్‌బీ, ఆధార్ కార్డు, ఆధార్ లింక్ అయిన ఫోన్ నంబర్ తీసుకుని తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. నియోజకవర్గంలో రాప్తాడు, అనంతపురం రూరల్, ఆత్మకూరు, కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో సుమారు 50 వేల మంది రైతులు ఉన్నారు. చాలా మంది రైతులకు ఈ కార్డుల గురించి ఇంకా తెలియకపోవడం, వ్యవసాయ సిబ్బంది పూర్తి స్థాయిలో అవగాహన కల్పించకపోవడంతో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ ప్రారంభమై మూడు రోజులు గడుస్తున్నా పదుల సంఖ్యలో కూడా ఆన్‌లైన్ కాలేదు. చాలా మంది రైతులకు తమ ఆధార్ కార్డులకు ఫోన్ నంబర్లు లింక్ కాకపోవడం కూడా ఒక కారణం. అలాగే రీసర్వే పూర్తయిన రెవెన్యూ గ్రామాల్లో ప్రతి సర్వే నంబర్‌కు నూతనంగా ఎల్‌పీఎం (ల్యాండ్ పార్సెల్ మ్యాప్) నంబర్లు కేటాయించారు. ఎల్‌పీఎం నంబర్లు ఆన్‌లైన్‌లో రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకే ఎల్‌పీఎం నంబర్ ఇద్దరు, ముగ్గురు రైతులకు కేటాయించడంతో ఆన్‌లైన్ కావడం లేదు. భూమి తక్కువగా ఉన్న రైతులకు ఎక్కువ, ఎక్కువగా ఉన్న రైతులకు తక్కువగా చూపిస్తుండడంతో ఏమి చేయాలో తెలియడం లేదని రైతులు చెబుతున్నారు.

మొరాయిస్తున్న సర్వర్లు

ఒకే సారి అన్ని రైతు సేవా కేంద్రాల్లో విశిష్ట సంఖ్య నమోదు చేస్తుండటంతో సర్వర్లు మొరాయిస్తున్నాయి. ఆన్‌లైన్ ప్రక్రియలో భాగంగా రైతులకు ఓటీపీలు కూడా రావడం లేదు. రైతులు ఆర్‌ఎస్‌కేల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

రైతులకు బోలెడు ప్రయోజనాలు

ఆధార్ మాదిరిగా యూనిక్ కోడ్‌తో జారీ చేసే ఈ కార్డులు రైతులకు ఐడీ కార్డుగా ఉపయోగపడతాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అన్ని పథకాలను రైతుల యూనిక్ కోడ్‌తో అనుసంధానం చేస్తారు. రానున్న రోజుల్లో ఈ యూనిక్ నంబర్ ఉన్న వారికే పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, సబ్సిడీపై యంత్ర పరికరాలు, సూక్ష్మ పోషకాలు, పంట రుణాలు, పెట్టుబడి సాయం తదితర పథకాలు నేరుగా పొందే వీలు కలుగుతుంది. అలాగే ఈ యూనిక్ నంబర్‌ను ఉపయోగించి కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా బ్యాంకు లింకుతో కూడిన సేవలను పొందవచ్చు. దేశంలో ఎక్కడి నుంచైనా రైతుల రుణ అర్హత, రుణ బకాయిలు, ప్రభుత్వ పథకాల వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు.

నమోదు ఇలా..

వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతు అర్హుడే. ఆధార్‌కు ఫోన్ నంబర్ అనుసంధానమై ఉండాలి. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ జిరాక్స్, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ నంబర్ తీసుకుని రైతు సేవా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించాలి. ఈ ఆధారాలతో రైతు వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేస్తారు. నమోదు ప్రక్రియ పూర్తయిక వారికి విశిష్ట గుర్తింపు సంఖ్య రైతు సెల్‌ఫోన్‌కు ఓటీపీ ద్వారా కేటాయిస్తారు. ఆ నంబర్‌ను ఆన్‌లైన్‌లో ఎంటర్ చేస్తే నమోదు ప్రక్రియ పూర్తవుతుంది. రైతు సేవా కేంద్రాలకు వెళ్లలేని రైతులకు సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వివరాలు అందించి.. ఓటీపీ చెప్పడం ద్వారా నమోదు పూర్తి చేసుకోవచ్చు.

ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోండి



మండలంలో సుమారు 10 వేలకు పైగా భూ యాజమానులకు యూనిక్ కోడ్ అందిస్తాం. రైతులందరూ ఈనెల చివరిలోగా తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి తమ వివరాలను నమోదు చేసుకోవాలి. ఈ నెలాఖరు నాటికి ఈ ప్రక్రియ పూర్తి కావాలి. లేకుంటే ప్రభుత్వం అందించే పథకాలు, ప్రయోజనాలు పొందే అవకాశం కోల్పోతారు. రీ సర్వే అయిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎం నంబర్ల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

– శ్రీవాణి, ఏఓ, రాప్తాడు

కుక్కల దాడిలో 30 గొర్రె పిల్లల మృతి



కనగానపల్లి: మండల కేంద్రమైన కనగానపల్లిలో కుక్కల దాడిలో 30 గొర్రె పిల్లలు మృత్యువాత పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కనగానపల్లికి చెందిన పూజారి తిక్క బీరప్పకు 300 పైగా గొర్రెలు ఉన్నాయి. వాటిలో చిన్న పిల్లలను గూళ్ల కింద వదిలేసి ఉదయం మేత కోసం గొర్రెల మందను సమీపంలోని పొలాల్లోకి వేసుకొని వెళ్లాడు. అయితే ఆ తర్వాతా గ్రామంలోని ఊర కుక్కలు గొర్రె పిల్లలపై దాడి చేసి మెడలు, కాళ్లు కొరికేశాయి. దీంతో 30 గొర్రె పిల్లలు మృతి చెందాయి. మరో 10 పిల్లలు తీవ్రంగా గాయపడ్డాయి. చేతికి వచ్చిన 30 గొర్రె పిల్లలు మృతి చెందటంతో రూ.2 లక్షల దాకా నష్టపోయానని తిక్క బీరప్ప ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరుతున్నాడు.

చేపపిల్లల విడుదల

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని నాగసముద్రం, మేడాపురం గ్రామాల్లోని చెరువుల్లోకి మత్స్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం చేపపిల్లలను విడుదల చేశారు. నాగసముద్రం చెరువులోకి 30 వేలు, మేడాపురం చెరువులోకి 20 వేల చేప పిల్లలను విడుదల చేసినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ధర్మవరం మత్స్యశాఖ సహాయ సంచాలకులు శంకరయ్య, ఎఫ్‌ఎఫ్‌వో భార్గవి, పంచాయతీ కార్యదర్శి చంద్రిక పాల్గొన్నారు.

నిస్వార్థ ప్రజా సేవకుడు సంజీవయ్య



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మేయర్ వసీం



దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతపురం సిటీ: దళిత కుటుంబంలో పుట్టి ఉమ్మడి రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పని చేసిన దామోదరం సంజీవయ్య దేశానికే ఆదర్శంగా నిలిచారని ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ కొనియాడారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో శుక్రవారం దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిరాడంబర నేత దామోదరం సంజీవయ్య జీవితాన్ని నేటితరం నేతలు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. చిన్న వయస్సులోనే దేశంలో తొలి దళిత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి, భారత ప్రజాస్వామ్య చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేసుకున్నారని గుర్తు చేశారు. దేశంలోనే వృద్ధులకు పెన్షన్ పథకాన్ని తొలిసారి ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేసిన మొట్టమొదటి ముఖ్యమంత్రి సంజీవయ్యే అని తెలిపారు. కార్యక్రమంలో సీఈఓ రాజోలి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ జి.వెంకటసుబ్బయ్య, ఏఓలు విజయభాస్కర్‌రెడ్డి, షబ్బీర్ నియాజ్, ధనుంజయ, మహబూబ్‌వలి, రత్నాబాయి, ఉషాకుమారి, శ్రీవాణి, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం దామోదరం సంజీవయ్య

అనంతపురం కార్పొరేషన్: మాజీ సీఎం దామోదరం సంజీవయ్య యువతకు ఆదర్శమని మేయర్ వసీం పేర్కొన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ ఆవరణలో మాజీ సీఎం దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. తొలి దళిత సీఎంగా ఆయన కీర్తి గడించారన్నారు. వృద్ధాప్య పింఛన్ రూపకర్త అని గుర్తు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, కమిషనర్ బాలస్వామి, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎస్‌ఈ భాస్కర్ రావు, ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, అబూసలేహ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం: నిరాడంబరుడు, నిస్వార్థ ప్రజా సేవకుడు, నిబద్ధత కలిగిన మాజీ సీఎం దామోదరం సంజీవయ్య అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ప్రొఫెసర్ బాలసుబ్రహ్మణ్యం సూచించారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వద్ద శుక్రవారం దామోదరం సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. మండల్ వ్యవస్థ కంటే ముందే రాష్ట్రంలో బీసీలకు పబ్లిక్ సర్వీసెస్‌లో రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. బడుగు, బలహీన , పేద వర్గాలకు ఎనలేని సేవ చేశారని కొనియాడారు. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే కర్నూలు జిల్లాకు దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, డాక్టర్ అంకన్న, డాక్టర్ ఓబులేసు, డాక్టర్ విజయ్, సుదర్శన్, సునీల్, తిరుమలేశ్, నాగేంద్ర, శాంతిరాజ్, వెంకటేశ్, హేమంత్, శివ, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దసార్ల దూరం నిజమే..!

- ఓపీలను తనిఖీ చేసిన సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్
- వైద్యులు విధులకు గైర్హాజరు కావడంతో ఆగ్రహం
- డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ సౌజన్యలక్ష్మికి మెమోలు

సాక్షి ఎఫెక్ట్..



జీజీహెచ్‌లో ఈఎన్‌టీ ఓపీని తనిఖీ చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, ఏడీ మల్లికార్జున రెడ్డి

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పెద్దసార్లు విధులకు దూరం నిజమేనని నిర్ధారణ అయ్యింది. ఈనెల 14న సాక్షిలో పెద్దసార్లు దూరం .. పీజీలపైనే భారం అన్న కథనం ప్రచురితమైంది. దీనిపై ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, ఏడీ మల్లికార్జున రెడ్డి అప్రమత్తమయ్యారు. శుక్రవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఓపీ నంబర్లు 2, 3, 4, 5, 6, 15, 18 ఓపీలతో పాటు కొన్ని వార్డులను పరిశీలించారు. వైద్యులు అందుబాటులో ఉన్నారా? లేరా అని ఆరా తీశారు. ఓపీ నంబర్ 15 పల్మనాలజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సౌజన్య లక్ష్మి, ఓపీ నంబర్ 18లో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అనిల్‌కుమార్ అందుబాటులో లేరు. దీంతో అక్కడున్న వైద్యులను ఆరా తీస్తే ఇంకా రాలేదని సమాధానం ఇచ్చారు. ఇలా వైద్యులు విధులకు గైర్హాజరవుతున్న విషయం మరోసారి స్పష్టమైంది. దీంతో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అనిల్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సౌజన్య లక్ష్మికి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు మెమో జారీ చేశారు. విధుల గైర్హాజరుపై వివరణ ఇవ్వాలని మెమోలో పేర్కొన్నారు.

విధులకు గైర్హాజరైతే చర్యలు

సర్వజనాస్పత్రిలో అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు తప్పక అందుబాటులో ఉండాలి. ఓపీ సమయం 9 నుంచి 4 వరకూ రోగులకు సేవలందించాలని సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, ఏడీ మల్లికార్జున రెడ్డి సంబంధిత హెచ్‌ఓడీలకు స్పష్టం చేశారు. ఇష్టారాజ్యంగా విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవన్నారు. పీజీలతో దగ్గరుండి శిక్షణ నిప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా అత్యవసర విభాగాల్లోనూ వైద్యులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రోగి పరిస్థితి విషమంగా ఉంటే తక్షణం వార్డుల నుంచి అత్యవసర విభాగాలకు మార్చుకోవాలన్నారు. రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దన్నారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, గ్రేడ్–1 నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను తిరస్కరించాలి



బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ నిరసన ర్యాలీ చేపట్టిన వామపక్ష పార్టీల నాయకులు

అనంతపురం అర్బన్: ప్రజావ్యతిరేక విధానాలకు నిదర్శనంగా నిలిచిన కేంద్ర బడ్జెట్‌ను ప్రజలు తిరస్కరించాలని వామపక్ష పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ శుక్రవారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, ఎస్‌యూసీఐ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర, సీపీఐ ఎంఎల్ ఎన్‌డీ నాయకుడు నాగరాజు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందన్నారు. ప్రజల్లో కొనుగోలు శక్తి కుచించుకుపోయిందన్నారు. ఆర్థిక వ్యవస్థలో తగ్గిన డిమాండ్ సమస్యను పరిష్కరించడానికి బదులు.. అందుకు విరుద్ధంగా మోదీ ప్రభుత్వం సంపన్నులకు రాయితీలివ్వడం, ఖర్చులో కోత పెట్టడం గర్హనీయమన్నారు. నిరుద్యోగ సమస్యను బడ్జెట్‌లో పూర్తిగా విస్మరించడం జరిగిందన్నారు. ఆహార సబ్సిడీలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమానికి బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించడం దుర్మార్గమన్నారు. ధరల పెరుగుదల, జీఎస్టీ పెంపుదలతో ఇబ్బందులు పడుతున్న కార్మికవర్గాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈనెల 20 వరకూ కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీల నాయకులు రామిరెడ్డి, శ్రీరాములు, రాజేష్‌గౌడ్, వెంకట నారాయణ, అల్లీపీరా, రమణ, కృష్ణుడు, నాగప్ప, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శోభాయాత్ర



నగరవీధుల్లో సాగిన శోభాయాత్ర

అనంతపురం కల్చరల్: జిల్లాలో తొలిసారి సహస్ర ఘట మహాకుంభాభిషేక మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నగరంలోని ఆర్‌ఎఫ్ రోడ్డు లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నుంచి కలశాలతో నగరవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. ఆలయంలో మూడు రోజుల పాటూ సాగే ఉత్సవాలకు ప్రధాన అర్చకుడు ఏఎల్ఎన్ శాస్త్రి, ఇతర అర్చక బృందం లాంఛనంగా శ్రీకారం చుట్టారు. మూలవిరాట్టుకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలతో పాటూ అలంకార సేవలు చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రమణారెడ్డి మాట్లాడుతూ.. శని, ఆదివారాల్లో విశేష కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. విశిష్ట అతిథిగా విచ్చేసే హంపీ పీఠాధిపతి విద్యారణ్య స్వామి నేతృత్వంలో 108 జంటలతో సామూహిక గణపతి, నవగ్రహ, లక్ష్మీనారాయణ, ఇతర దేవతా హవనాదులు, మహాకుంభాభిషే వేడుకలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొండయ్య, నాగరాజు, గోపాల్, గుప్తా, ఫ్లెక్స్ రమణ తదితరులు పాల్గొన్నారు.

చెత్తను కంపోస్టు యార్డుకు తరలించరా?



సంగమేష్ సర్కిల్‌లో చెత్త నిర్వహణపై అసహనం వ్యక్తం చేస్తున్న కమిషనర్ బాలస్వామి

అనంతపురం కార్పొరేషన్: గుట్టలు గుట్టలుగా ఉన్న చెత్తను కంపోస్టు యార్డుకు తరలించేకపోతే ఎలా? పారిశుధ్య కార్యదర్శులు వారి పరిధిలో ఉన్న ప్రాంతాల్లో చెత్త నిర్వహణ పక్కాగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలి. బాధ్యతారాహిత్యంగా ఉంటే చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని సాయినగర్, సూర్యనగర్, సంగమేష్ సర్కిల్ రోడ్డు, వేణుగోపాల్ నగర్ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. సంగమేష్ సర్కిల్‌లో గుట్టలు గుట్టలుగా చెత్త ఉండటంతో అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, పారిశుధ్య కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. హోటల్ నిర్వాహకులు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేస్తున్నారని చెప్పారు. హోటల్ నిర్వాహకులు చెత్తను రోడ్డుపై వేయకుండా డస్ట్ బిన్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నగరపాలక సంస్థ చెత్త తరలించే వాహనాలకు అందించాలన్నారు. అదేవిధంగా చెత్త ఎక్కడా కన్పించకుండా ఎప్పటికప్పుడు తరలించేలా చూడాలన్నారు. పారిశుధ్య కార్యదర్శులు జాబ్ చార్ట్‌ను అనుసరించాలని సూచించారు. ప్రతి ఒక్కరి వద్ద వైర్‌లెస్ సెట్ అందుబాటులో ఉంచుకుని పనులు చేయాలన్నారు. అనంతరం నీరుగంటి వీధిలో ఉన్న అన్నా క్యాంటీన్‌ను పరిశీలించారు. అన్నా క్యాంటీన్లలో కంప్యూటర్ ద్వారా టోకన్లు అందించేలా చూడాలని డీఈ సత్యనారాయణను ఆదేశించారు. శ్రీనగర్ కాలనీలో నీరు ప్రగతి వనం పార్క్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. నగరంలోని వివిధ పార్క్‌ల్లో వసతులు కల్పించాలని తెలిపారు. పార్క్‌ల్లో పచ్చదనం మెరుగు పరచాలన్నారు. కార్యక్రమంలో ఈఈ షాకీర్, డీఈ సుభాష్, పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త పొలానికి మళ్లీ నిప్పు



కాలిపోయిన అల్ల నేరేడు మొక్కలు

రాప్తాడు: మండలంలోని పుల్లలరేవు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పెద్ద ఓబులేష్, వసంత్‌కు చెందిన పొలానికి మళ్లీ నిప్పు పెట్టారు. బాధితుల వివరాలమేరకు.. మండలంలోని గొందిరెడ్డిపల్లి రెవెన్యూ పరిధి (పులల్లరేవు) పరిధిలోని సర్వే నంబర్ 103-2 (88-3)లో 4.90, 103-3 (88-3)లో పెద్ద ఓబులేష్, వసంత్ తమకున్న 7.76 ఎకరాల వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం ఆ పొలంలో రెండేళ్ల క్రితం దాదాపుగా 400 అల్ల నేరేడు మొక్కలను నాటారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెద్ద ఓబులేష్‌కు చెందిన మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. ఈ ఏడాది జనవరి 17న 15 చెట్లు, అలాగే జనవరి 21న 40 చెట్లను టీడీపీ నాయకులు నరికివేశారు. మళ్లీ ఈ నెల 3న గుర్తు తెలియని వ్యక్తులు పెద్ద ఓబులేష్ తోటకు నిప్పు పెట్టడంతో కొన్ని చెట్లు కాలిపోయాయి. వారం రోజులు కూడా గడవక ముందే మళ్లీ ఈ నెల 10న మరో సారి నిప్పు పెట్టడంతో తోటలోని డ్రిప్ పరికరాలు, మోటర్ సెల్ పూర్తిగా కాలిపోయాయి. 10 రోజులు కూడా గడవక ముందే మూడోసారి పొలానికి నిప్పు పెట్టడంతో దాదాపుగా 4 ఎకరాల్లో పొలం చుట్టూ ఉన్న ముళ్ల కంప కాలిపోయింది. ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆయుష్ ఆస్పత్రులను బలోపేతం చేయాలి



మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆయుష్ అసోసియేషన్ నాయకులు

అనంతపురం మెడికల్: ఆయుష్ ఆస్పత్రులను బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రీయ ఆయుష్ మెడికల్ అసోసియేషన్ నాయకులు కోరారు. గురువారం నగరంలోని ఓ బీజేపీ నేత ఇంటికి వచ్చిన మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఆయుష్ ఆస్పత్రుల్లో వైద్య, పారా మెడికల్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ హాస్పిటల్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఆయుర్వేద, హోమియోపతి, యునాని, నాచురోపతి వైద్యుల సమస్యలను విన్నవించారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్రీయ ఆయుష్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బండారు నాగేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి పోగుల కుమారయ్య, ఉపాధ్యక్షుడు నల్లపాటి తిరుపతి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి

రామగిరి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని పార్టీ మండల కన్వీనర్ మీనుగ నాగరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. రామగిరి గ్రామ కమిటీని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు అయినప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ప్రజా సమస్యలపై అందరూ పోరాడదామన్నారు. కార్యక్రమంలో గంగన్న, శంకరయ్య, దాసరి రవి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.